క్లుప్తంగా

అపూర్వ కలయిక



తూగుండ్రం పాఠశాలలో కలుసుకున్న పూర్వపు విద్యార్థులు

గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997-1998 సంవత్సరంలో పదో తరగతి విద్యను అభ్యసించిన పూర్వపు విద్యార్థులు ఆదివారం ఉపాధ్యాయులతో కలిసి ఆత్మీయంగా కలుసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి హెచ్ఎం భక్తవత్సలరెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణపిళ్లై, మోహనపిళ్లై, మాధవన్, హేమలత, వెంకటనరసింహ, కమరల్లీని ఘనంగా సన్మానించారు. వారి నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. వారు చదువుకున్న స్కూల్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

గంగాధరనెల్లూరు: వైఎస్సార్ ఆసరా మూడవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం 1 గంటకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరుగుతుందని మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్ కల్యాణమస్తు నగదు పంపిణీ



కల్యాణమస్తు నగదు సాయాన్ని అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: వైఎస్సార్ కల్యాణమస్తు కింద రూ.50 వేలు నూతన దంపతులకు ఆదివారం వెదురుకుప్పంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండలంలోని మాంబేడు గ్రామానికి చెందిన ఎస్.భార్గవి, గుర్రప్ప పెళ్లి చేసుకుని వైఎస్సార్ కల్యాణమస్తు కింద ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రూ.50 వేలు మంజూరు కావడంతో ఆ నగదును ఉప ముఖ్యమంత్రి వారికి అందజేశారు. ముందుగా వారిని ఆశీర్వదించారు.

సర్పంచ్ ధనమ్మకు నివాళి

శ్రీరంగరాజపురం: మండలంలోని డీకే మర్రిపల్లి సర్పంచ్ ధనమ్మ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఆదివారం ఆమె చిత్రపటానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ ధనమ్మ మరణం పార్టీకి తీరని లోటు అని, పార్టీ తరఫున కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మండల కన్వీనర్ అనంతరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, నాయకులు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

కార్వేటినగరం: మన ఆరోగ్యం మన చేతుల్లో ఉంటుందని, వైద్యాధికారుల సలహాలను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ధనంజయరెడ్డి అన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సుద్దగుంట గ్రామంలో 50 మంది వలంటీర్లతో గ్రామంలో ఇళ్ల మధ్యలో ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. అనంతరం ఎయిడ్స్, కరోనా వ్యాధులపై స్లోగన్లతో కూడిన ప్లకార్డులతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి, గ్రామ యువత, వలంటీర్లు పలువురు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

శ్రీరంగరాజపురం: మండలంలోని చిన్నతయ్యూరు గ్రామం సీఎస్ఐ చర్చిలో ఆదివారం మద్రాస్ అధ్యక్ష ఆధీనపు కుటుంబ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మద్రాస్ డయాసిస్‌లోని 260 పాస్ట్రేట్ నుంచి 300 మంది పాస్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మద్రాస్ డయాసిస్ బిషప్ రేవర్ జార్జ్ స్టీఫెన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, ఏసుక్రీస్తు జననం, మహిమల గురించి ప్రబోధించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సరిత, డయాసిస్ అశోక్‌కుమార్, ఎర్నెస్ట్ సెల్వదొరై, ఏసుదాను, జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలపై భయం వద్దు

పాలసముద్రం: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలంటే భయం, ఆందోళన చెందరాదని హెచ్ఎం మనోహర్‌నాయుడు తెలిపారు. ఆదివారం బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల్లో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల స్థలదాత మునిరత్నం నాయుడు, చెంగల్‌రాజు, ఇందిరమ్మ. విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులను చేస్తాం

- ఆడపడుచులు మరోసారి సీఎం జగనన్నను ఆదరించాలి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: మహిళలను లక్షాధికారులను చేయడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎంపీపీ లత, ఏపీఎం విజయకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడవ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఆ రాష్ట్రం అన్నివిధాలా ముందంజలో ఉంటుందన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ మూడవ విడత ఆసరా పథకం కింద అక్కచెల్లెమ్మలకు రూ.9.40 కోట్లను అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నాల్లో 7 పథకాలను మహిళల పేరిట అందించి మహిళా లోకం గర్వంగా చెప్పుకునే విధంగా ఆదుకుంటున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో అక్కచెల్లెమ్మలు జగనన్నను ఆదరించి మరెన్నో సంక్షేమ పథకాలను అందుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీపీ లత మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా సుస్థిరమైన ఆదాయం పొందాలనే ఆశయంతో తోడ్పాటును అందిస్తూ, అక్కచెల్లెమ్మల జీవితాల్లో ఆర్థిక, సామాజిక చైతన్యానికి సీఎం జగనన్న కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ తులసి మాట్లాడుతూ 2019లో నిల్వ ఉన్న పాత అప్పును కూడా తీర్చిన ఘనత కూడా రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లా రుణాలు చెల్లించడంలో ముందంజలో ఉందని గుర్తు చేశారు. అదేవిధంగా సంఘాల ద్వారా కర్మాగారాలు ఏర్పాటు చేసుకోవడానికి కోట్లరూపాయలు రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక భరోసాతో మహిళలు అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నూర్జాహాన్‌ను ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, ఎంపీపీ లత, పీడీ తులసి శావలుకప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. కార్య క్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, ఎంపీడీఓ మోహన్‌మురళి, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయరెడ్డి, రాష్ట్ర ముస్లీం మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి హమీద్ బాషా, రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ సుమతి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు కార్తీక్‌రెడ్డి, మణెమ్మ, సీనియర్ నాయకుడు శేఖర్‌రాజు, చంద్రశేఖర్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, డ్వాక్రా మహిళలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



ఆసరా మెగా చెక్కును అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి, పీడీ, ఎంపీపీ

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే ఆ కుటుంబం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం రూ.7.80 కోట్ల చెక్కును డ్వాక్రా మహిళలకు అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ తులసి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, దూది మోహన్, కృష్ణారెడ్డి, యతీశ్వరనాయుడు, దాము, పలువురు పాల్గొన్నారు.

మాట ప్రకారం రుణమాఫీ..



మహిళలకు రుణ విముక్తి కల్పించేందుకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేయడం సంతోషకరం. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీకి ఈ పథకం కింద ఏటా సాయం అందిస్తూ నాలాంటి పేదవారి బతుకుల్లో ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు సీఎం జగనన్న కృషి చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.3లక్షల 36 వేల 300 అప్పుతీరింది. అందులో నావాటా రూ.36 వేలు వచ్చింది. సీఎం జగనన్న రుణం ఎప్పటికీ తీర్చుకోలేను.

–ఎస్.చాందుబీ, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు, కార్వేటినగరం

సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం



కుటుంబ పోషణకు ఆర్థిక ఇబ్బందులతో ఎంతో సతమతమయ్యేవాళ్లం. ఎస్‌హెచ్‌జీ గ్రూపులో చేరాక బ్యాంకు నుంచి రుణం పొందాం. మొదటి విడత ఆసరా నగదుతో పాడి ఆవు కొన్నా. రెండవ విడత ఆసరాతో ఇంటి వద్ద చిన్నపాటి వ్యాపారం మొదలు పెట్టి కుటుంబాన్ని పోషిస్తున్నా. మూడో విడతలో కుట్టు మిషన్ కొనుగోలు చేసి ఇంకా ఆర్థికంగా ముందుకు వెళ్లడానికి అవకాశం కలిగింది. పేదలపై ఇంతటి ఆదరాభిమానం చూపుతున్న సీఎం జగనన్నకు మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది.

– కోమది, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు, పద్మసరస్సు

జనం అభిమానాన్ని కొనలేరు



విజయపురం: మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- సీఎం జగనన్న పేదల గుండెల్లో ఉన్నారు
- ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలు అందిస్తున్నారు
- మరోమారు వైఎస్సార్‌సీపీని ఆదరించండి
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి (విజయపురం): జనం గుండెల్లో జగనన్నపై ఉన్న అభిమానాన్ని ఎవరూ కొనలేరని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆదివారం విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా మూడవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ గెలిపిస్తేనే ఇన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రాన్ని చంద్రబాబు నాయుడు అప్పుల్లో పెట్టినా, ఎన్ని కష్టాలు వచ్చినా, తన పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానాలను సీఎం జగనన్న చిరునవ్వుతో అమలు చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు లభించాలని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి పేదవాడు పక్క రాష్ట్రంలో కూడా కార్పొరేట్ వైద్యం చేసుకునేలా సీఎం జగనన్న అవకాశం కల్పించారన్నారు.

రూ.5.65 కోట్ల లబ్ధి..

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అక్కచెల్లెమ్మలకు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తున్నారని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. జగనన్న ఆసరా కింద విజయపురం మండలంలోని 6వేల మందికి రూ.5.65 కోట్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. మహిళలు 2024 ఎన్నికల్లో జగనన్నకు మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ జమున, వైస్ ఎంపీపీ మంజుబాలాజీ, తహసీల్దార్ వెంకట్రాయలు, ఎంపీడీఓ సతీష్, దశరథరాజు, మండల పార్టీ అధ్యక్షుడు గోపీనాథ్, ఆర్బీకే చైర్మన్ గుణశేఖర్ రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు హరినాయుడు, నాయకులు శివరాజు, ప్రసన్న, నారపరాజు, మురళీ రెడ్డి, బాలసుబ్రమణ్యం నాయుడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు రూరల్: ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఆ విద్యకు సార్థకత చేకూరుతుందని పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆదివారం స్థానిక జ్ఞానజ్యోతి ప్రైవేటు పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అందిస్తున్న పలు ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అదే మీరు ప్రభుత్వానికి ఇచ్చే కానుక అని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రకాష్‌రాజు విద్యాభివృద్ధికి చేసిన సేవలను గుర్తు చేస్తూ, ఆయన అకాల మరణం విద్యార్థులకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో డీఈఓ శేఖర్, పాఠశాల కరస్పాండెంట్ హరినాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నగరి: ఆసరా పంపిణీ కార్యక్రమంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

ఉరకలెత్తిన ఉత్సాహం



దూసుకుపోతున్న కోడె గిత్తలు

వెదురుకుప్పం: సై అంటే సై అన్నట్లు ఆదివారం మండలంలోని పాతగుంటలో సాగిన జల్లికట్టు యువకుల్లో జోష్ తెచ్చింది. రంకెలేస్తూ దూసుకుపోయిన కోడెగిత్తలు...ఈలలు కేకలతో పలకల కోసం యువత చేసిన సాహసాలు...పోట్లగిత్తల పరుషానికి బెంబేలెత్తిన జనం చప్పట్లతో ఎడ్ల పందేలు దుమ్ము రేపాయి. నిర్వాహకులు ఎడ్లకు పలకలు, వస్త్రాలు కట్టి పందేనికి సిద్ధం చేశారు. అప్పటికే అధిక సంఖ్యలో గ్రామానికి చేరుకున్న యువత పందేనికి సై అన్నట్టు అల్లి వద్ద నిలబడ్డారు. పందేనికి సిద్ధంగా ఉన్న ఎడ్లను ఉసిగొల్పారు. కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జన ప్రవాహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోయాయి. ఎద్దులను నిలువరించి పలకలు పట్టేందుకు యువత విశ్వ ప్రయత్నం చేశారు. యువకులు ఎంత ప్రయత్నించినా పశువుల దూకుడును కట్టడి చేయలేక నిరుత్సాహపడ్డారు. పలకలు లాక్కొనే సందర్భంలో ఒకరికొకరు తోసుకున్నారు.

నేడు వాహనాల వేలం

నగరి: నగరి ఎస్ఈబీ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను సోమవారం ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ వర్ధనాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతలపట్టెడలోని ఎస్ఈబీ కార్యాలయ ఆవరణలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహిస్తామన్నారు. సదరు వేలంపాటలో పాల్గొనే వారు తప్పనిసరిగా జీఎస్టీ కలిగి ఉండాలన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత గోవిందరెడ్డి



గోవిందరెడ్డికి సంతాపం తెలుపుతున్న నెహ్రూ యువజన సంఘం సభ్యులు

వడమాలపేట: యువతకు స్ఫూర్తి ప్రదాత గోవిందరెడ్డి అని రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత వెంకమరాజు అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రం వడమాలపేటలో ఎస్వీపురం నెహ్రూ యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం నెహ్రూ యువకేంద్ర సంఘటన్ విశ్రాంతి జోనల్ డైరెక్టర్ స్వర్గీయ డాక్టర్ గోవిందరెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువజన సంఘం అధ్యక్షురాలు జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ గోవిందరెడ్డి ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల్లో జిల్లా యూత్ కో-ఆర్డినేటర్‌గా పనిచేసిన సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో యువజన, మహిళా సంఘాలు స్థాపించి వారికి నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం నేర్చుకోవడానికి కృషి చేశారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించి యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు తోడ్పాటు అందించారని గుర్తు చేశారు. గ్రామీణ అభివృద్ధికి సహకరించారని, నిరుద్యోగ యువతకు ఉపాధి, స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణ ఇప్పించి వారికి ఉపాధి కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు నాదముని, శ్రీనివాసులు, మురళి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దాసరుల సంక్షేమానికి కృషి చేయండి



సమావేశమైన దాసరి కులస్తులు

వడమాలపేట: దాసరుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని దాసరి సంఘం ప్రధాన కార్యదర్శి ఆకుల వాసు కోరారు. ఆదివారం మండలకేంద్రం వడమాలపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో దాసరి సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ దాసరి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. ఏప్రిల్ 25వ తేదీన రామానుజాచార్యులు జయంతి సందర్భంగా సంఘం తరపున వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చెంగల్‌రాయులు, తమిళనాడు దాసరి అభ్యుదయ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూరుగ మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: మండల అభివృద్ధికి అధికారులు జవాబుదారీగా పని చేయాలని ఎంపీపీ లత పిలుపునిచ్చారు. ఆదివారం వెలుగు కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా పని చేసినప్పుడే మండలం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని అన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలస్థాయిలో ఎక్కడా తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ 11 వేల జాబ్‌కార్డులు అందించడం జరిగిందని, ప్రతి ఒక్కరూ తమ పాన్‌కార్డును ఆధార్‌కు లింకు చేసుకోవాలన్నారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ హేమకుమార్ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 7వేల పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాలైన వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌మురళి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ లోకనాథరెడ్డి, ఈఓపీఆర్డీ లక్ష్మీపతి, వైస్ ఎంపీపీ మణెమ్మ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ





యుద్ధంలో తలపడుతున్న భీమ, దుర్యోధన పాత్రధారులు, అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ద్రౌపదీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవ ఉత్సవమూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధన వధ ఘట్టం ఆకట్టుకుంది. భీముడు దుర్యోధనున్ని గంగమడుగు నుంచి తీసుకొచ్చే ఘట్టం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. అదేవిధంగా దుర్యోధనుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంటతడి పెట్టించాయి.

భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండ ప్రవేశ భక్తులు పూలమాలలు ధరించి, చేతిలో వేపాకులతో చేసిన గోవింద నామస్మరణాలతో ఆలయ ఆవరణం మార్మోగింది. ఆలయ నిర్వాహకులు వేణునాయుడు, సర్పంచ్ హరిత, రాజశేఖర్‌నాయుడు, నారాయణస్వామి, కుప్పయ్య, ఎస్ఐ షెక్షావలి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.